
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

బుధవారం 21 ఆగస్టు 2024

ఫొటోగ్రాఫర్లకు నిర్మలాజగ్గారెడ్డి సన్మానం

సంగారెడ్డిరూరల్, ఆగస్టు 20 : సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని ఫొటోగ్రాఫర్లను నిర్మలాజగ్గారెడ్డి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతీ పనికి సమయ పరిమితి ఉంటుందని, ఒక్క ఫొటో జర్నలిస్టుకు మాత్రం సమయ పరిమితి లేకుండా.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పని చేస్తూనే ఉంటారని చెప్పారు. సమాచారాన్ని అందించడం, అవగాహన కల్పించడం, సమాజాన్ని ప్రశ్నించడం, మధుర స్మృతులు అందించడం, చరిత్రను చూపడం ఒక్క ఫొటోగ్రఫీకే సాధ్యమని తెలిపారు. ఫొటో జర్నలిస్టులు ఆర్థికంగా ఎంతో వెనుకబడ్డారని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి



ప్రపంచ ఫొటోగ్రఫీ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

ఆర్టీసీకి భారీగా ఆదాయాన్ని తెచ్చిన రాఖీ

- రోజువారీ కంటే రెట్టింపు సంఖ్యలో ప్రయాణం
- సిద్దిపేట డిపోకు రూ.41,01,181 లక్షలు
- దుబ్బాక డిపోకు రూ.16,63,640 లక్షలు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 20 : రాఖీ పౌర్ణమి.. ఆర్టీసీకి ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. రాఖీ పండుగను పురస్కరించుకుని సిద్దిపేట, దుబ్బాక డిపోల్లో ప్రయాణికులు రోజువారి కంటే రెట్టింపుస్థాయిలో ప్రయాణించినట్లు డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ రెండు డిపోల చరిత్రలోనే అత్యధిక ఆదాయం రావడానికి కృషి చేసిన ఉద్యోగులను ఆయన అభినందిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట డిపో నుంచి 55,615 కిలోమీటర్లు ఆపరేట్ చేయగా రూ.41,01,181 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. రోజువారీ కంటే 17వేల కిలోమీటర్లు అధికంగా నడిపినట్లు తెలిపారు. ఎక్కువగా జేబీఎస్ రూట్ లో ఆపరేట్ చేసినట్లు చెప్పారు. నిత్యం 35వేల నుంచి 40వేల మంది ప్రయాణిస్తుంటారని, రాఖీ రోజు 72 వేల మంది ప్రయాణించినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 18,52,151, రూ.22.58లక్షల నగదు వచ్చినట్లు స్పష్టం చేశారు. దుబ్బాక డిపో 20,140 కిలోమీటర్లు ఆపరేట్ చేయగా రూ.16,63,640 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. రోజువారి కంటే 7వేల కిలోమీటర్లు అదనంగా అన్నిరూట్లలో ఆపరేట్ చేసినట్లు చెప్పారు. ఈ డిపో నుంచి నిత్యం 15వేల నుంచి 20వేల మంది ప్రయాణిస్తారని, రాఖీ పండుగ రోజు 30 వేల మంది ప్రయాణించినట్లు తెలిపారు. మహాలక్ష్మి ద్వారా రూ.10.98 లక్షలు, నగదు రూ.5.65 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు.



ప్రమాదం నుంచి రక్షించి..

తానే ప్రమాదంలో పడి

- ఆటో ఢీకొని వ్యక్తి మృతి



రామాగౌడ్ (ఫైల్)

మిరుదొడ్డి, ఆగస్టు 20 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని కాపాడబోయి ఆటో ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామశివారులో చోటుచేసుకున్నది. అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు అతివేగంగా వస్తున్న టీఎస్06యూటీ3686 నంబరు కారు అదుపు తప్పి చిట్టాపూర్‌లోని డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమూల్య, చందన గాయపడ్డారు. రోడ్డు పక్కనే నివసిస్తున్న రామాగౌడ్ (50) క్షతగాత్రులను కారులో నుంచి బయటకు తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాడు. ఈ క్రమంలో భూంపల్లి నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఏపీ 15ఎక్స్3627 ఆటో వేగంగా వచ్చి రామాగౌడ్‌ను ఢీకొట్టింది. అతని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. రామాగౌడ్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తును చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



పాశాన్ని పోస్తుంటే ఆరగిస్తున్న భక్తులు

సంజీవరాయుని గుట్టపై

వరద పాశం

అక్కన్నపేట, ఆగస్టు 20: అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో గ్రామంలోని సంజీవరాయుని గుట్టపై ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం భక్తజన సందోహం నడుమ వరద పాశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో సంజీవరాయుని గుట్టపై ఉన్న ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పుష్కలంగా పండాలని మొక్కులు చెల్లిస్తారు. గుట్టపైనే నైవేద్యం వండి వరదలా పాశాన్ని పోస్తుంటే అదే రీతిలో వర్షాలు బాగా పడి పంటలు పండుతాయని భక్తుల విశ్వాసం. గుట్టపైన ఉన్న కోనేరులో స్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం వండి వరదలా పాశాన్ని పోస్తుంటే భక్తులు ఆరగించారు. వరద పాశం కార్యక్రమాన్ని గోవర్ధనగిరి గ్రామస్థులు ఏటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

సిద్దిపేటలో మరోసారి హైటెన్షన్

- రాజీవ్ జయంతి సందర్భంగా మైనంపల్లి భారీ కాన్వాయ్‌తో ర్యాలీ
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సమావేశం
- క్యాంపు కార్యాలయం వైపు రాకుండా దారి మళ్లించిన పోలీసులు
- భారీగా పోలీసుల మోహరింపు

సిద్దిపేట టౌన్, ఆగస్టు20: సిద్దిపేటలో మరోసారి హైటెన్షన్ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల ఫ్లెక్సీవార్ జరిగి ఇరువర్గాలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులకు పూర్తి రుణమాఫీ కాలేదంటూ మంగళవారం కార్యాచరణ సమావేశాన్ని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ క్రమంలోనే సిద్దిపేటలో మైనంపల్లి హనుమంతరావు పర్యటన ఉండటంతో పోలీసు భారీ సంఖ్యలో మోహరించారు. ఎలాంటి ఘటనలూ జరకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు చేపట్టారు. బుధవారం సిద్దిపేటలోని పొన్నాల వద్ద రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేఆర్ చౌరస్తా నుంచి హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వైపు వెళ్లకుండా పోలీసులు దారి మళ్లించారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు తన వాహనంలో పట్టణంలో నుంచి వెళ్లేందుకు ప్రయత్నించగా మైనంపల్లి హనుమంతరావు, పోలీసులు వద్దని కోరడంతో, దారి మళ్లించిన రూట్‌లోనే వెళ్లారు. దాంతో పాటు కార్యకర్తలు కూడా అటువైపు వెళ్లకుండా పోలీసులు మూడంచెల బారికేడ్లు, వాహనాలను అడ్డుగా పెట్టారు. బీజేఆర్ చౌరస్తా నుంచి ఎన్సాన్‌పల్లి చౌరస్తా, భారత్‌నగర్, విక్టరీ థియేటర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్‌కు చేరుకున్నారు. కార్యక్రమం సజావుగా ముగియడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.



ర్యాలీలో కాంగ్రెస్ నాయకులకు అభివాదం చేస్తున్న హనుమంతరావు



ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం : మైనంపల్లి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన మాట మేరకు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేయాలన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలని సూచించారు. రుణమాఫీ కాని రైతులు ఆయా నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జుల దృష్టికి తీసుకెళ్లితే, రుణమాఫీ జరిగేలా చొరవ తీసుకుంటారని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, నాయకులు సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, రియాజుద్దీన్, బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్, షాబోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్

- మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

అబద్ధపు హామీలు, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి, ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంపూర్ణ రుణమాఫీ సాధన కార్యాచరణపై ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, దేవిప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఫారూక్ హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడారు. రైతులకు మేలు చేయాలనే సంకల్పంతోనే రూ.2లక్షల రుణమాఫీ చేయించేందుకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా సవాల్ విసిరారని తెలిపారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొంది రూ.31వేల కోట్లకుగాను, రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేసి, హరీశ్‌రావును రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ప్రశాంతంగా ఉన్న సిద్దిపేటను చిచ్చుపెట్టేందుకు దాడుల సంస్కృతికి తెరలేపారని, దానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్దిపేట పౌరుషానికి త్యాగానికి ప్రతీకనని, తెలంగాణ ఉద్యమానికి ఉద్యమకారులకు అడ్డా అన్నారు. కాంగ్రెస్ చేసిన రుణమాఫీ అంతా ఫాల్స్, దోకాబాజీ అన్నారు. ప్రక్షాళన చేయాల్సింది మూసినది కాదని, సీఎం రేవంత్‌రెడ్డి నోరు చేయాలన్నారు. క్యాంపు కార్యాలయంపై దాడి తెలంగాణ సమాజంపై దాడిగా భావిస్తున్నామని చెప్పారు. దమ్ముంటే నీ కొడుకు రోహిత్‌రావు చేత రాజీనామా చేయించి, మెదక్‌లో పద్మారెడ్డి మీద గెలవాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ సవాల్ విసిరారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్దిపేటకు మైనంపల్లి హనుమంతరావుకు ఏం సంబంధమని, నీకు ఇక్కడ రేషన్‌కార్డు, ఆధార్ కార్డు ఉందా అని ప్రశ్నించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

క్రీడాహబ్‌గా హుస్నాబాద్

- మంత్రి పొన్నం ప్రభాకర్
- కలెక్టర్‌తో కలిసి సుడిగాలి పర్యటన
- పలు అభివృద్ధి పనుల పరిశీలన

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 20: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆయన కలెక్టర్ మనుచౌదరితో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. హుస్నాబాద్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యాబోధన, మౌలిక సౌకర్యాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేయనున్న కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. బాలికల కళాశాలను సందర్శించి పేరుకుపోయిన గడ్డిని, పిచ్చిచెట్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు సూచించారు. హుస్నాబాద్‌లో శిల్పారామం, రవీంద్రభారతి తరహాలో ఆడిటోరియం నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని ఆర్డీవో, తహసీల్దార్‌ను ఆదేశించారు. పశువైద్యశాల, మున్సిపల్ నూతన భవనాన్ని పరిశీలించారు. హుస్నాబాద్‌లో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు కోసం స్థలం పరిశీలించాలని సూచించారు. అలాగే పట్టణంలోని మినీ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులను ఆదేశించారు. స్టేడియంలో ఆటలు ఆడుకోవడానికి డిగ్రీకళాశాల, మోడల్‌స్కూల్, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులను అనుమతించేలా చర్యలు చేపట్టాలన్నారు. స్టేడియాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు, పెద్దస్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుతో పాటు ఫుట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేయాలని వీటిని సెప్టెంబరు 20లోగా ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేశారు. హుస్నాబాద్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు, ఆటల్లో ప్రావీణ్యం పొందిన సీనియర్ క్రీడాకారులతో త్వరలో కమిటీ ఏర్పాటు చేసి భవిష్యత్తులో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. నిర్మాణంలో ఉన్న శ్మశానవాటికను వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. మెడికల్ కళాశాలకు సంబంధించిన స్థలాన్ని, అక్కన్నపేట మండలం చౌటపల్లి స్టేజీ వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. హుస్నాబాద్‌లో నిర్మితమవుతున్న వెజ్, నాన్‌వెజ్ భవనాన్ని పరిశీలించారు. రైతుబజార్ పూర్తయిన సందర్భంగా ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఓ టీ కొట్టులో మంత్రి టీ తాగారు. ఆయన వెంట ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వెంకన్న, వైస్‌చైర్‌పర్సన్ అనితారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిత్తారి పద్మ, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు, వివిధశాఖల అధికారులు ఉన్నారు.



మినీస్టేడియాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్




హుస్నాబాద్‌లో టీ తాగుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

'మల్లన్న' పాలకమండలి నియామకంపై

ఇంటెలిజెన్స్ విచారణ!

చేర్యాల, ఆగస్టు 20 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామక కసరత్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు. ధర్మకర్తల మండలి నియామకానికి ప్రభుత్వం కొద్ది రోజులక్రితం నోటిఫికేషన్ విడుదల చేసిన క్రమంలో కొమురవెల్లి మల్లన్న ఆలయంతో పాటు మెదక్, సంగారెడ్డి, హైదరాబాద్ దేవాదాయశాఖ కార్యాలయాల్లో 82మంది దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుల వయసు, నిర్ణీత గడువు, డబుల్ అప్లికేషన్‌తో పాటు ఇతరత్రా అంశాలకు సంబంధించి ఆయా దరఖాస్తులను పరిశీలించి 20 ఫారాలను తిరస్కరించారు. మిగిలిన వాటిల్లో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలకు సంబంధించి 28 మంది దరఖాస్తులున్నాయి. ఆశావహులకు సంబంధించి నేరచరిత్ర, పోలీసు కేసులు ఏమైనా ఉన్నాయా? ఉంటే పెండింగ్‌లో ఉన్నాయా.. శిక్ష అనుభవించారా.. వంటి అంశాల సేకరణ పనిని దేవాదాయశాఖ అధికారులు ఇంటెలిజెన్స్ విభాగానికి అప్పగించారు. రెండురోజులుగా దరఖాస్తుదారుల వివరాల గుర్తింపునకు పోలీస్‌స్టేషన్లతో పాటు స్థానిక వ్యక్తిగత స్థితిగతులను అధికారులు తీస్తున్నారు. విచారణ పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించిన అనంతరం కమిటీ నియామకం జరగనున్నది. చాలాయేళ్ల తర్వాత రెగ్యులర్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం, వచ్చే డిసెంబరులో మల్లన్న కల్యాణం జరగనుండటంతో కమిటీ నియామకంపై ఆసక్తి నెలకొన్నది. ఆశావహుల్లో పలువురు చైర్మన్ పదవి కోసం, మరికొందరు డైరెక్టర్ల పదవి కోసం పావులు కదుపుతున్నారు. నియోజకవర్గ నేతలు స్థానికులకే చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబడుతుండగా, హైదరాబాద్‌కు చెందిన పలువురు నేతలు యాదవ సామాజికవర్గానికి చైర్మన్ పదవి కేటాయించాలని అధిష్టానంపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇప్పటికే కొన్నినెలలక్రితం ఓ వ్యక్తిపేరు ఖరారు చేసినట్లు ప్రచారం జరిగింది. నియోజకవర్గ రాజకీయ పరిణామాలతో సదరు వ్యక్తిని మార్చుతూ జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి అతి సన్నిహితులైన మరో ఇరువురి పేర్లు తెరమీదకు వచ్చాయి. త్రిముఖ పోరులో ఆయన ఎవరికి అవకాశం కల్పించనున్నారన్న విషయం చర్చనీయాంశంగా మారింది.



కొమురవెల్లి మల్లన్న ఆలయం

హైదరాబాద్‌లో తలనీలాల వేలంపాటలు

మల్లికార్జునస్వామి ఆలయ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో తలనీలాల సేకరణ వేలంపాటలు నిర్వహించారు. భక్తులు మొక్కుబడిగా సమర్పించిన తలనీలాలు పోగు చేసుకునేందుకు ఏటా సీల్డ్‌టెండర్ కం బహిరంగ వేలంపాటలు చేపడుతారు. ఈ క్రమంలో గతేడాది రూ.86లక్షలు ఆదాయం సమకూరింది. ఈ ఏడాదికి సంబంధించి ఆలయంలో నాలుగు సార్లు వేలంపాటలు నిర్వహించినా సరైనపాట రాకపోవడంతో వాయిదాపడ్డాయి. దీంతో పలు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈవో బాలాజీశర్మ హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఐదవసారి వేలంపాటల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. ఈ ప్రొక్యూర్‌మెంట్‌లో ఎవరూ టెండర్ దాఖలు చేయకపోగా, బహిరంగ వేలంలో ఆరుగురు టెండర్‌దారులు పాల్గొన్నా నిరాసక్తత కనబరిచారు. గతేడాది టెండర్ దక్కించుకున్న రుద్ర ఎంటర్‌ప్రైజెస్ సంబంధీకులు రూ.61.20లక్షలకు హెచ్చు పాటపాడారు. కానీ గతేడాదికన్నా తక్కువగా పాట రావడంతో దేవాదాయశాఖ కమిషనర్ అనుమతి కోరుతూ ఈవో బాలాజీశర్మ ప్రతిపాదనలు పంపించారు. కమిషనర్ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటామని, కమిషనర్ ఆమోదం తెలిపితే రుద్ర ఎంటర్ ప్రైజస్‌కు ఖరారుఅవుతుందని, నిరాకరిస్తే రీ-టెండర్ చేపట్టనున్నామని ఈవో తెలిపారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి





ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, మనోహరాబాద్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఎంజే పాఠశాల విద్యార్థులు

కంది, ఆగస్టు 20: కోల్‌కత్తాలోని మెడికల్ కళాశాలలో ట్రైనీ వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ మంగళవారం సాయంత్రం అన్ని యూనియన్లకు సంబంధించిన ఉద్యోగులు దోషులను శిక్షించాలని ఫ్యాక్టరీని ఫౌండరీ గేట్ నుంచి షాపింగ్ కాంప్లెక్స్ వరకు నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఓఎఫ్ఎంకే, ఏబీడీఈఎఫ్, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోల్‌కత్తా ఘటన నిందితుడిని శిక్షించాలి

మనోహరాబాద్, ఆగస్టు 20: కోల్‌కత్తా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని మనోహరాబాద్ మండల కేంద్రంలోని జేఎంజే ప్రైవేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోహరాబాద్ దుర్గావాహిని మహిళా విభాగం ఆధ్వర్యంలో పాఠశాల నుంచి మనోహరాబాద్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మనోహరాబాద్ దుర్గావాహిని సభ్యులు మాట్లాడుతూ వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు చేయాలన్నారు. ఈ ర్యాలీలో దుర్గావాహిని బాధ్యులు ర్యాకల నిత్య, చెలిమెల వైష్ణవి, కుమ్మరి మౌనిక, కృతిక, బజరంగ్‌దళ్ సభ్యులు యువకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

● గొంగ్లూరు గిరిజన తండాలో ఘటన



రమావత్ జగ్యా (ఫైల్)

పుల్‌కల్, ఆగస్టు 20: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పుల్కల్ మండలం గొంగ్లూర్ గిరిజనతండాకు చెందిన రమావత్ జగ్యా(43) రాఖీ పండుగ సందర్భంగా అదే గిరిజన తండాలో ఉన్న అత్తగారి ఇంటికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలతో వెళ్లాడు. రాత్రివరకు అత్తగారి ఇంట్లోనే గడిపిన జగ్యా భోజనం చేశాక రాత్రి 11 గంటలకు ఒంటరిగా ఇంటికి వచ్చి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల వల్లనే జగ్యా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● రెండుకు చేరిన రోడ్డు ప్రమాద మృతులు

కల్హేర్, ఆగస్టు 20: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌కుమార్(38) అనే వ్యక్తి మంగళవారం మృతిచెందినట్లు కల్హేర్ ఏఎస్ఐ అంజయ్య తెలిపారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్.. తన స్నేహితులు బొడియాల విలాస్, సాయిలుతో కలిసి ఈ నెల 15న నారాయణఖేడ్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధి మునిగేపల్లి శివారులోని నారాయణఖేడ్-నిజాంపేట రహదారిపై ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో పెద్దశంకరంపేటకు చెందిన బొడియాల విలాస్(35) అక్కడిక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌కుమార్, సాయిలు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ప్రవీణ్‌కుమార్ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. దీంతో రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య రెండుకు చేరింది. మరో వ్యక్తి సాయిలు కోలుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రవీణ్‌కుమార్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిపించినట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

జీవితంపై విరక్తితో బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడి ఆత్మహత్య



పడమటి సాయిలు(ఫైల్)

కల్హేర్, ఆగస్టు 20: జీవితంపై విరక్తితో బీజేపీ ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్హేర్ మండలం మాసాన్‌పల్లికి చెందిన పడమటి సాయిలు(39) బీజేపీ ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడిగా.. ఇంతకుముందు బీజేపీ మండలాధ్యక్షుడిగా పనిచేశారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పాటు సంతానం కలగకపోవడంతో మదనపడేవారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై మండల పరిధి మహదేవ్ శివారులోని వ్యవసాయ భూమిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే సాయిలు మృతదేహం పాక్షికంగా కుళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. రెండురోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





డంపింగ్‌యార్డుకు బదులు కంది శివారులోని అసైన్డ్ భూమిలో పారబోస్తున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, నిరుపయోగంగా డంపింగ్‌యార్డు

అటకెక్కిన తడి, పొడి చెత్త సేకరణ

అసైన్డ్‌భూమిలో చెత్త డంపింగ్

- అంటురోగాలకు అడ్డాగా మారిన వైనం
- ఆస్పత్రుల చుట్టూ పరుగులు
- అలంకారప్రాయంగా డంపింగ్‌యార్డులు
- విజృంభిస్తున్న దోమలు, క్రిమి, కీటకాలు



విషజ్వరాలు, సీజనల్ వ్యాధులతో మంగళవారం కంది పీహెచ్‌సీలో కిక్కిరిసిన ప్రజలు

కంది, ఆగస్టు 20: సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన కంది గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ అటకెక్కింది. చెత్త సేకరణ రిక్షాలను మూలనపడేశారు. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుల్లో వేరుచేసి ఎరువులు తయారు చేయాలని గతంలో చెప్పిన అధికారుల మాటలు నీటి మూటలయ్యాయి. పంచాయతీ ట్రాక్టర్‌తో సేకరించిన చెత్తను తీసుకెళ్లి గ్రామ శివారులోని అసైన్డ్‌భూమిలో ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. అంతేగాక కందిలోని హోటళ్లు, దాబాల్లో మిగిలిన ఆహార వ్యర్థాలను డంపింగ్‌యార్డు పక్కనే పారబోస్తున్నా.. పంచాయతీ అధికారులకు నిమ్మకు నీరెత్తడం లేదు. సీజనల్ వ్యాధులపై ఉన్నతాధికారులు గంటల తరబడి సమావేశాలు పెట్టి పంచాయతీ అధికారులను ఆదేశిస్తున్నా.. వీరు మాత్రం ప్రజల ఆరోగ్యం విషయంలో ఎలాంటి శ్రద్ధ చూపటం లేదని స్పష్టమవుతున్నది. మరోపక్క పరిశుభ్రత విషయంలో ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని తెలుస్తున్నది. ఇందుకు కారణం ఉన్నతాధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడమే అని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మంగళవారం కంది పీహెచ్‌సీ విషజ్వరాలు సీజనల్ వ్యాధులతో కిక్కిరిసిపోయారు.

ఆరు బయటనే వ్యర్థాల పారబోత

కందిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పక్కన ఉన్న డంపింగ్‌యార్డు ఉన్నది. అయితే దాంట్లో కాకుండా పక్కన ఆరు బయటనే ప్లాస్టిక్ డబ్బాలు, డ్రమ్ముల్లో తీసుకొచ్చి ఆహార వ్యర్థాలను పారబోస్తున్నారు. ఆహార వ్యర్థాలు ఎక్కువగా ఉంటే ఆ పక్కనే మట్టితో కప్పెట్టేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా భరించలేని దుర్గంధం వెదజల్లుతున్నది. ఆహార వ్యర్థాలు ఉంచిన డబ్బాలపైన ఎలాంటి మూతలు లేకపోవడం, కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న పేదలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

అసైన్డ్‌భూమిలో చెత్త

కంది గ్రామంలో సేకరించిన చెత్తను ఇప్పటికీ కంది శివారులోని అసైన్డ్ భూమిలో పారబోస్తున్నారు. ఆ చెత్తంతా ప్లాస్టిక్ కవర్లతో నిండి ఓ గుట్టలాగా కనిపిస్తున్నది. ఇలా పెద్ద కుప్పలాగా అయిన చెత్తను నెలరోజులకు ఒకసారి తగలబెడుతున్నారు. అసైన్డ్ భూమి పక్కనే, రిజిస్ట్రేషన్ కార్యాలయం, మైనార్టీ గురుకుల పాఠశాల కూడా ఉన్నది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, చెత్తను ఇక్కడ పారబోయొద్దని ఉపాధ్యాయులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం శూన్యం.

నిరుపయోగంగా డంపింగ్‌యార్డు

నాలుగేళ్ల క్రితం దాదాపు రూ.రెండున్నర లక్షలతో నిర్మించిన డంపింగ్‌యార్డు ఇప్పుడు నిరుపయోగంగా మారింది. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తతో ఎరువులు తయారు చేయాలని ఆదేశించిన ఉన్నతాధికారుల మాటలు ఆచరణలో అమలుకావడం లేదు. ఇప్పటివరకు ఒక్కరోజు కూడా చెత్తను ఉపయోగించి ఎరువును తయారు చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. ఇప్పుడు డంపింగ్‌యార్డు చుట్టూ చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండి వీధి కుక్కలకు అడ్డాగా మారింది.

సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం..

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది కొరత, ఇతరత్రా సమస్యలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు రోజువారీగా వివరాలను ఉన్నతాధికారులకు చెబుతున్నాం. ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యమందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అత్యవసర మనిపిస్తేనే హైదరాబాద్, బీదర్ తదితర ప్రాంతాలకు తరలించాల్సి వస్తుంది. ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన సేవలందించేలా కృషి చేస్తున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ శ్రీధర్, ఆస్పత్రి సూపరింటెండెంట్



కందిలో డంపింగ్‌యార్డు పక్కనే మంగళవారం ఆహార వ్యర్థాలను పారబోసి కప్పివేస్తున్న దృశ్యం



కందిలో మూలకు పడ్డ చెత్త సేకరణ రిక్షాలు

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 15 తులాల బంగారం, రూ.80 వేల నగదు అపహరణ
- క్లూస్ టీంతో ఆధారాలు సేకరణ



ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులను పరిశీలిస్తున్న క్లూస్‌టీం

హత్నూర, ఆగస్టు 20: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి నగలు, నగదు అపహరించుకుపోయిన సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తహేర్కాన్‌పేట గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంజరి అంజనేయులు, లావణ్య దంపతులు పిల్లలతో కలిసి సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి రాఖీ కట్టడానికి బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగిరావడంతో ఇంటి ప్రధాన తలుపుల తాళం పగులగొట్టి ఉండడంతో ఆందోళన గురయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో అల్మారా తలుపులు తెరిచి ఉండడంతో పాటు చీరలు, నగలకు సంబంధించిన డబ్బాలు చిందరవందరగా పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారమందించారు. 15 తులాల బంగారు నగలతో పాటు రూ.80 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు. ఎస్‌ఐ సుభాష్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంగారెడ్డి నుంచి చిట్టిబాబు ఆధ్వర్యంలో క్లూస్‌టీంను రప్పించి పలు ఆధారాలు సేకరించారు. బాధితుడు వంజరి అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

- వెండి కిరీటం, ముక్కుపుడుక, వెండి కళ్లు, బంగారు బొట్టు బిళ్ల అపహరణ



వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్‌ఐ మురళీధర్‌గౌడ్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 20: గుర్తుతెలిన దుండగులు గంగమ్మ గుడి తాళం పగులగొట్టి అమ్మవారి నగలు అపహరించుకుపోయిన సంఘటన సోమవారం రాత్రి నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో చోటుచేసుకుంది. చిన్నకోడూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే గంగపుత్ర సంఘం వాళ్లు ఉదయం గుడికి వెళ్లగా.. గర్భగుడి తాళాలు పగులగొట్టి ఉండి, అమ్మవారి కిరీటం కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారమందించారు. సంఘటనా స్థలానికి చిన్నకోడూరు ఏఎస్‌ఐ మురళీధర్‌గౌడ్ వెళ్లి పరిశీలించారు. గంగమ్మ ఆలయంలో 1.14 కిలోల వెండి కిరీటం, బంగారు ముక్కుపుడక, వెండి కళ్లు, బంగారు బొట్టు బిల్లను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. గంగపుత్ర సంఘం ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



స్వామి(ఫైల్)

రాయపోల్, ఆగస్టు 20: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగి చనిపోయాడు. ఎస్‌ఐ రఘుపతి వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం వీరానగర్ గ్రామానికి చెందిన నిమ్మరాజు స్వామి(40) మంగళవారం ఉదయం స్థానిక తుమ్మకుంట చెరువులో చేపలు పట్టడానికి వల తీసుకొని వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ఆయన కాళ్లకు వల చుట్టుకుంది. నీటిలో మునిగిపోతున్న సమయంలో కేకలు వేశాడు. ఈ కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి స్వామిని రక్షించేందుకు చెరువులోకి వెళ్లేసరికి నీటిలో మునిగిపోయాడు. చాలాసేపు చెరువులో గాలించగా స్వామి మృతదేహం లభించింది. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు వివాహమైంది. మతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రసాయన వ్యర్థ జలాలు తాగి రెండు పాడిగేదెలు మృతి

- అపస్మారకస్థితిలో మరో ఐదు పాడిగేదెలు



అయ్యమ్మ చెరువుకట్టపై మృతిచెందిన గేదె వద్ద ఆందోళన చేస్తున్న కిష్టాయ్యపల్లి వాసులు

జిన్నారం, ఆగస్టు 20: రసాయన వ్యర్థ జలాలు తాగి రెండు పాడిగేదెలు మృతిచెందగా.. మరో ఐదు అపస్మారక స్థితిలోకి వెళ్లాయి. ఈ సంఘటన కిష్టాయపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు పరిశ్రమ బస్సులను అడ్డుకుని మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన బసెట్టిగారి సాయికుమార్ అనే రైతుకు పాడి గేదెలు గ్రామ శివారులో మేతకు వెళ్లి కాలుష్య జలాలు తాగి మృతిచెందాయి. అతడికి చెందిన మరో ఐదు గేదెలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. దీంతో మాజీ సర్పంచ్ నీరుడి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బసెట్టిగారి రాజు, నాయకులు వెంటేష్, శంకర్ బాధిత రైతుతో కలిసి పారిశ్రామికవాడకు వెళ్లే అయ్యమ్మ చెరువుపై పాడి గేదెలతో ఆందోళనకు దిగారు. పరిశ్రమలకు వెళ్లే బస్సులు, వాహనాలు అడ్డుకొని, రసాయన జలాల తీరుపై మండిపడ్డారు. తరచూ కాలుష్య జలాల తాగి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని, బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు. కాలుష్య జలాల విడుదలకు కారకులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానికుల ఆందోళనతో గంటపాటు పారిశ్రామిక వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి.

రైల్వే బ్రిడ్జి కోసం భూసేకరణపై మిట్టపల్లిలో గ్రామసభ

- భూమి ఇచ్చేది లేదన్న బాధితులు
- అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన



మిట్టపల్లిలో గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 20: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి పరిసర ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి కోసం మంగళవారం గ్రామపంచాయతీ వద్ద భూసేకరణపై గ్రామ సభను నిర్వహించారు. భూసేకరణ విషయమై గతంలోనే ఒక లిస్టును తయారుచేసి బాధితులకు ఇచ్చామని, దానిపై ఏమైనా సవరణలు ఉంటే చేసుకోవాలని గ్రామసభకు హాజరైన అధికారులు గ్రామస్థులకు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సవరణల విషయం పక్కనపెడితే అసలు భూసేకరణకు తాము ఒప్పుకోమని, నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా బ్రిడ్జిని నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్నారు. భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చే సమయంలో 60 రోజుల్లో అభ్యంతరాలు ఉంటే తెలుపాలని చెప్పారని, కానీ తాము అభ్యంతరాలు చెప్పినా ఏ అధికారి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరం మేరకే బ్రిడ్జిని నిర్మించాలని గతంలో ఎన్నో ఉద్యమాలు, ఆందోళన చేసినప్పటికీ తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అందరికీ ఇబ్బంది లేకుండా బ్రిడ్జి నిర్మించాలని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం ఆపడానికి ఎటువంటి అధికారం లేదని, పనులు కొనసాగుతాయని భూసేకరణ విషయంలో ఎక్కువ, తక్కువ సవరణ విషయంలో అభ్యంతరాలు మాత్రమే తెలుపాలని సూచించి అధికారులు వెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

నా చివరి రక్తపు బొట్టు వరకూ మీతోనే..

- ఎంపీ రఘునందన్
- దురహంకారంతోనే కేసీఆర్ ఓడారు
- రైతులతో ఆటలాడితే రేవంత్‌కూ అదే గతి



కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్

రామాయంపేట, ఆగస్టు 20: 'నా చివరి రక్తపు బొట్టు వరకూ మీకోసం శ్రమిస్తా.. మీరు లేనిదో మొన్నటి ఎన్నికలో నేను గెలవలేను.. పార్టీ కార్యకర్తలే నన్ను ఆదరించారు' అని మెదక్ ఎంపీ రఘునందన్ అన్నారు. మంగళవారం రామాయంపేట, నిజాంపేట మండలాలకు సంబంధించిన ఓటర్లకు కృతజ్ఞత సభ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే సత్తా చూపాలన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా శ్రమించిన మీరు సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ఎక్కువ శాతం ప్రజాప్రతినిధులుగా గెలవాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. మరో రెండు, మూడు మాసాల్లో ఎన్నికల నగారా మోగనుందని, ఇందుకు మనమంతా సమాయత్తం కావాల్సి ఉందన్నారు. కాగా గత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ దురంహకారాన్ని ప్రజలు ఓడించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పేర మోసం చేస్తోందన్నారు. అంతేగాక మంత్రులకు పరిపాలనా విధానంపై ఎలాంటి అవగాహన లేకుండాపోతోందని చెప్పారు. పాలన ఇలాగే కొనసాగితే కేసీఆర్‌కు పట్టిన గతే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తప్పదని రఘునందన్ ఘాటుగా హెచ్చరించారు. రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటలో మరో రెండు రైళ్లను నిలిపేందుకు కేంద్రమంత్రికి లేఖ ఇస్తానన్నారు.

మరో బైపాస్ ఏర్పాటుపై హైవే అధికారులతో సమీక్ష

ఇప్పటికే ఒక బైపాస్ నిర్మించారు. ఇప్పుడు సంగారెడ్డి-ఎల్కతుర్తి జాతీయ రహదారి విస్తరణలో మరో బైపాస్ ఏర్పాటుపై ఎంపీ హైవే అథారిటీ అధికారులతో సమీక్షించారు. బైపాస్ లేకుండా రూటు వెడల్పుపై ఆలోచించి, నిర్ణయం తీసుకోవాలని తన అభిప్రాయాన్ని అధికారుల ముందుంచారు. ఇదివరకే బైపాస్‌తో విలువైన భూములు కోల్పోయి, వ్యాపార రంగానికి నష్టం జరిగింది. ఈసారి అలాకాకుండా ఉన్న రహదారినే మరింత వెడల్పు చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ విషయంపై మరోమారు చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటే రామాయంపేట పురోభివృద్ధిలో అధిగమిస్తుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేపీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్, రాగి రాములు, వేల్పుల సిద్ధిరాములు, నిజాంపేట అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కుమార్తెకు యాక్సిడెంట్ అయ్యిందంటూ బురిడీ

- రూ.30వేలు పోగొట్టుకున్న మహిళా ఉద్యోగి

చేర్యాల, ఆగస్టు 20: 'మీ కూతురుకు యాక్సిడెంట్ అయ్యింది. వెంటనే రూ.50 వేలు పంపించండి.' అంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళా ఉద్యోగికి కాల్ చేసి బురిడీ కొట్టించడంతో రూ.30వేలు పోగొట్టుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని ట్రాన్స్‌కో ఈఆర్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగికి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌కాల్ చేసి తాము పోలీసులమని హిందీ భాషలో మాట్లాడారు. ఆమె కూతురు పేరు చెప్పి రోడ్డు ప్రమాదానికి గురైందని, వెంటనే డబ్బులు పంపించా లని మాయమాటలతో నమ్మబలికించడంతో రూ.30 వేలు ఫోన్‌పే ద్వారా పంపించింది. మరో రూ.20వేలు పంపించాలని ఒత్తిడి చేయడంతో అనుమానం రావడంతో కాల్ కట్‌చేసి పోలీసులను ఆశ్రయించడంతో దర్యాప్తు చేపట్టారు.

నేషనల్ హైవేల వెంట మియావాకీ ఫ్లాంటేషన్

- 53 ఎకరాల్లో నాటేందుకు ఏర్పాట్లు
- ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాస్‌రావు



తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద మొక్క నాటుతున్న పీడీ, జీఎంఆర్ ప్రతినిధులు

తూప్రాన్, ఆగస్టు 20: జాతీయ రహదారులను ఆనుకుని 53 ఎకరాల ల్యాండ్ పార్సిల్‌లో మియావాకీ ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఆయన మొక్కనాటారు. అనంతరం మియావాకీ ప్లాంటేషన్, మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమ బ్యానర్‌ను ఆవిష్కరించారు. జాతీయ రహదారులను గ్రీన్ కవర్‌తో నింపేందుకు ఎన్‌హెచ్ఏఐ వివిధ ప్రదేశాలలో మియావాకీ ప్లాంటేషన్‌ను నాటేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. జాతీయ రహదారులను గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేస్‌గా మార్చడమే లక్ష్యమన్నారు. జీఎంఆర్ హైవేస్ హెడ్ శంకర్ గణేశన్, ఎంఎస్‌వీ ఇంజనీర్ హజ్రాత్‌రెడ్డి, జీఎంఆర్ హైవేస్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ, వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, హైవేస్ ప్రతినిధులు, రక్ష సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సమ్మె షురూ



సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఆరోగ్య మిత్రలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల సమ్మె బాటపట్టారు. తొలిరోజు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 43 మంది ఆరోగ్యమిత్రలు ఇదేవిధంగా నల్లబ్యాడ్జీలు ధరించి ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌లో కూర్చొని విధుల్లో పాల్గొన్నారు. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి చొరవ తీసుకోకపోవడంతో వారంతా సమ్మెబాట పట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆరోగ్యమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు హిమగిరి ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద 16 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, విధి నిర్వహణలో మరణిస్తే రూ.50 లక్షల ఆర్థిక సాయం చేయాలని, అంతేకాకుండా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులివ్వాలని, ఆరోగ్యమిత్రలను డీపీవో క్యాడర్ కల్పించాలని, జీవో 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని, షఫ్లింగ్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

రుణమాఫీ కోసం 'రణం'

- బ్యాంకుల వద్ద రైతుల పడిగాపులు
- జాబితాలో పేరు లేకపోవడంతో ఆందోళనలు



బెజ్జంకి మండలం తోటపల్లి ఇండియన్ బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు



చేర్యాల ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయం నుంచి ఆవరణ వరకు బారులుతీరిన రైతులు

బెజ్జంకి, ఆగస్టు 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకంలో అర్హులైన తమకు రుణమాఫీ కాలేదని రైతులు బ్యాంకు ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులను నిలదీశారు. బెజ్జంకి మండలంలోని తోటపల్లి ఇండియన్ బ్యాంకు పరిధిలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు పంట రుణం తీసుకున్నారు. సంబంధిత బ్యాంకు పరిధిలో సగానికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు.. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్లనే తమకు రుణమాఫీ కాలేదని నిలదీశారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది మూలంగానే తాము నష్టపోయామని ఆరోపిస్తూ బ్యాంకు షెటర్‌ను మూసివేశారు. సిద్దిపేట జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. అర్హత ఉండి రుణమాఫీ కాని రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మాఫీ అయ్యేలా చూస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అలాగే మండల కేంద్రంలోని రైతువేదికలో పంట సాగు మెళకువల పట్ల శాస్త్రవేత్తలతో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మహేష్ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల రైతులు రైతువేదిక వద్దకు చేరుకుని, తమకు రుణమాఫీ కాలేదని నిలదీశారు. మండలంలోని సంబంధిత బ్యాంకుల్లో రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయం వద్ద బారులు

చేర్యాల, ఆగస్టు 20: ప్రభుత్వం దఫాలవారీ పంట రుణమాఫీ అమలుచేసిన క్రమంలో చేర్యాల, కొమురవెల్లి, ధూళిమిట్ట, మద్దూరు, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాల రైతులు తమ వివరాలు తెలుసుకోవడంతో పాటు లోన్ రెన్యూవల్ చేసుకునేందుకు చేర్యాల పట్టణంలోని పలు బ్యాంకులకు పరుగెత్తుతున్నారు. దీంతో ఆయా బ్యాంకులు రైతులతో కిటకిటలాడుతున్నాయి. మంగళవారం చేర్యాల పట్టణంలోని ఎస్‌బీఐ, ఏడీబీ బ్రాంచ్‌కి రైతులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మేనేజర్ శ్రీలత రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా బ్యాంకు ఆవరణలో టెంట్ వేయించి కుర్చీలు ఏర్పాటుచేశారు. తాగునీటి వసతి కల్పించడంతో ఓపికగా ఉండి అలసట తీర్చడంతో ఆమెను అభినందించారు. సాంకేతిక కారణాల వల్ల రూ.1 నుంచి రూ.2 లక్షల వరకు రుణమాఫీ కాని వారు గ్రీవెన్స్ దరఖాస్తులు అందించేందుకు వ్యవసాయాధికారి కార్యాలయానికి తరలివచ్చారు.

కల్హేర్‌లోనూ ఆందోళన

కల్హేర్, ఆగస్టు 20: రుణమాఫీ కోసం విధించిన నిబంధన ప్రక్రియ సజావుగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుణాలు చెల్లించి, సకాలంలో రెన్యూవల్ చేయించిన రైతులకు సంబంధించి రుణమాఫీ జాబితాలో పేరు లేకపోవడంతో మంగళవారం కల్హేర్ వ్యవసాయ కార్యాలయానికి చేరుకుని ఆందోళన పట్టారు. వివిధ సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తింపజేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ సిబ్బందిని ఆశ్రయించి దరఖాస్తులు చేసుకుంటున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు: ఏడీఏ

రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతులు ఆందోళన చెందవద్దని నారాయణఖేడ్ వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్ కుమార్ అన్నారు. మంగళవారం కల్హేర్‌లోని రైతువేదికలో రైతులతో మాట్లాడి వారి సందేహాలకు సమాధానమిచ్చి, రుణమాఫీ జరగని రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వారితో మాట్లాడుతూ రైతులకు సాంకేతిక కారణాలతోనే రుణమాఫీ కాలేదని, ఆందోళన చెందవద్దన్నారు. వారంరోజుల్లో అందరికీ రుణమాఫీ రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సంతోష కుమారి, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

'నీటి నిల్వలు ఉండనివ్వొద్దు'



నీటిని పారబోయిస్తున్న వైద్యాధికారి

మద్దూరు, ఆగస్టు 20: నీటి నిల్వల ద్వారా దోమలు వృద్ధి చెందుతాయని, ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని పట్టుకోవాలని వైద్యాధికారి సువర్ణసన్ సూచించారు. మండలంలోని రేబర్తి గ్రామ ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడారు. జలుబుతో పాటు జ్వరాలున్న వారికి మందులు అందజేసినట్లు తెలిపారు. పరిసరాలను ఎప్పకప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ దేవదాసు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

వంతెన.. ఇంతేనా..!?

- వర్షానికి కొట్టుకపోయిన మట్టి
- వర్షాకాలం వచ్చిందంటే తప్పని తిప్పలు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు

వర్గల్, ఆగస్టు 20: వర్షకాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామానికి వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే. ఉన్న ఒక్క మార్గం వర్షంతో ఉంటుందా కొట్టుకపోతుందా తెలియని దుస్థితి, ఆ మార్గంలో వంతెన నిర్మించాలని పలుమార్లు ప్రజలు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఎదో తూతూ మంత్రంగా తాత్కలివంగా మార్గాని సరిచేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదు. మండలంలోని దండుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చందాపూర్ గ్రామంలో సుమారు 20 కుటుంబాలు ఉంటున్నాయి. ఆ గ్రామానికి వెళ్లాలంటే బోర్రగూడెం నుంచి మట్టి రోడ్డు ద్వారా వెళ్లాలి. బోర్రగూడెం చందాపూర్ మార్గంలో కాలువ ఉండడంతో ఆ కాలువలో సిమెంట్ పైపులను వేసి వాటిపై మట్టిని పోశారు. వర్షం పడినప్పుడల్లా కాలువపై వేసిన మట్టి కొట్టుకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ గ్రామ ప్రజలది ప్రతీ వర్షాకాలంలో ఇదే పరిస్థితి.



నీటిలో కొట్టుకపోయిన చందాపూర్ వెళ్లే మట్టి దారి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరోసారి బోర్రగూడెం చందాపూర్ గ్రామాల నడుమ ఉన్న మార్గంలో వేసిన మట్టి వరదకు కొట్టుకపోయింది. కాలువపై వేసిన పైపులు చెల్ల చెదురైయ్యాయి. దీంతో చందాపూర్ గ్రామానికి వెల్లలేని దుస్థి. గత ప్రభుత్వం బోర్రగూడెం చందాపూర్ మార్గంలో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని స్థానికులు చెబుతున్నారు. గతంలో రెండు మూడు సార్లు సొంత డబ్బులతో కాలువ వద్ద మట్టి పోయించి మార్గాని సరి చేసుకున్నామని గ్రామస్థులు తెలిపారు. వర్షకాలం వచ్చిందంటే ఆ గ్రామం ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి వరద నీటిలో కొట్టుకపోయింది. మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు

కొండపాక, ఆగస్టు 20: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లి బందారం కూడలి వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బందారం నుంచి అంకిరెడ్డిపల్లి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని దుద్దెడ నుంచి బందారం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న నంగునూరు మండలం ముండ్రాయి గ్రామానికి చెందిన సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు.

రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దు

- ఏవో జయంత్‌కుమార్



చిన్నకోడూరు: ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏవో జయంత్‌కుమార్

చిన్నకోడూరు/మద్దూరు, ఆగస్టు 20: అన్ని అర్హతలు ఉండి రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెద్దవద్దని, పలు కారణాలతో రుణమాఫీ కానీ రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు ఏవో జయంత్‌కుమార్ తెలిపారు. చిన్నకోడూరు రైతు వేదికలో మంగళవారం రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023లోపు రుణం పొందిన ప్రతీ రైతుకు రుణ మాఫీ వర్తిస్తుందన్నారు. రుణమాఫీకి అర్హత ఉన్న మండలంలోని రైతులు ఫిర్యాదులను ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అయా క్లస్టర్‌ల ఏఈవోలు పాల్గొన్నారు.

వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతుల నుంచి మద్దూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు ఏవో బి. రామకృష్ణ తెలిపారు. రైతులు బ్యాంకు నుంచి రుణం పొందిన స్టేట్‌మెంట్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకం జిరాక్స్ ప్రతులతో రావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాకేష్, అఖిల్ ఉన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దూళిమిట్ట, ఆగస్టు 20: మండలంలోని కొండాపూర్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు రుణమాఫీ కానీ రైతుల వివరాలను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సేకరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బిడ్డల విజయ్, నరసింహ్మనాయక్, గడిపే వెంకటయ్య, మాజీ సర్పంచులు రేఖ శ్రీనివాస్, లకావత్ సుజాత శ్రీనివాస్, రేణుక కాల్‌రామ్, బాపు కనకయ్య, బీమగోని సుధాకర్‌గౌడ్, మంద రాజు, లింగాల సంపత్, ఎనగందుల యాదగిరి, దరావత్ సంతు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి లోపాలను వెంటనే పరిష్కరించాలి

- రైతుసంఘం నాయకుడు చేతిరెడ్డి లింగారెడ్డి

గజ్వేల్, ఆగస్టు 20: ధరణి లోపాలను వెంటనే సవరించాలని రైతుసంఘం నాయకుడు చేతిరెడ్డి లింగారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కారదర్శి శివలింగు కృష్ణ, సీపీఐ నాయకులు రాజేశం, రైతులతో కలసి గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఐవోసీ వరకు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్న విధానాలను తొలగించి ధరణిని తీసుకువచ్చి నిరుపేదల భూములను కొల్లగొట్టారని, వేలాదిగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరలో ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టంలో కాస్తుదారులకు హక్కులు కల్పించేలా చూడాలని, ఏళ్లుగా భూమిని నమ్ముకుని జీవిస్తున్న రైతులకు అండగా నిలవాలని కోరారు. వారితో ప్రజ్ఞాపూర్‌తో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 20: ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సిద్దిపేట జిల్లా ట్రాఫిక్ పోలీసులకు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఏ విధంగా విధులు నిర్వహించాలి అనే అంశంపై మంగళవారం ఆయన ట్రాఫిక్ సిగ్నల్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. ప్రధాన కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఎలా చూపించాలి, ప్రజలకు, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలగకుండా వాహనాలను ఎలా పంపించాలి అనే అంశంపై ట్రాఫిక్ సిగ్నల్స్ పరేడ్ నిర్వహించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సిబ్బందికి ఐదు రోజులపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు.



శిక్షణ పొందుతున్న ట్రాఫిక్ సిబ్బంది

'మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు'



రాఘవాపూర్‌లో కళా బృందంతో కనువిప్పు కార్యక్రమం

సిద్దిపేట రూరల్,ఆగస్టు 20: యువత, ప్రజలు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదర్థాలకు బానిసలు కావద్దని సిద్దిపేట రూరల్ ఏఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో సోమవారం రాత్రి పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌లకు రిప్లై ఇవ్వవద్దని హెచ్చరించారు. కార్యాక్రమంలో గ్రామ మాజీ ప్రజా పతినిధులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతినిత్యం ఎన్నో పనుల కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, మండల వాసులతో కిటాకిటలాడుతున్న దౌల్తాబాద్ మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు లేక ఇక్కట్లు పడుతున్నారు. ఇతర జిల్లాల, మండలాల ప్రయాణికులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దౌల్తాబాద్ మండలం ఏర్పాటు అయ్యి 40 ఏళ్లు గడుస్తున్నా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏమాత్రం దృష్టి సారించడం లేదు. పబ్లిక్ టాయిలెట్ల కోసం 2020లో మాజీ సర్పంచ్ పిల్లర్ల వరకు పనులు చేసి వదిలేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పబ్లిక్ టాయిలెట్ల పనులు ముందుకు సాగడం లేదు. 6 నెలల క్రితం కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి నిలిచిన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం కోసం కొబ్బరికాయ కొట్టారు. ఇప్పటికి పనులు మొదలు కాలేదు. ఇప్పటికైనా పబ్లిక్ టాయిలెట్ల పనులు ప్రారంబించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- దౌల్తాబాద్

ఉపాధ్యాయురాలు కన్నుమూత

మర్కుక్, ఆగస్టు 20: మండల పరిధిలోని కేజీబీవీలో గణిత సీఆర్‌టీగా విధులు నిర్వహిస్తున్న గీతాదేవి(38) మంగళవారం మృతిచెందారు. వారం రోజులుగా ఆమె అనారోగ్యంతో బాదపడుతున్నారని కేజీబీవీ ఎస్‌వో భాగ్యలక్ష్మి తెలిపారు. లక్ష్మాపూర్‌లో ఆమె అంతిమ యాత్రలో శాసనమండలి సభ్యుడు కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి పాల్గొని కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలోనే పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయలు అందిస్తామన్నారు. వారితో సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ, మర్కుక్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నారెడ్డి రామకృష్ణారెడ్డి, తుమ్మకుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విరూపాక్ష వెంకటేశ్వర్‌రెడ్డి, రజిత, కేజీబీవీ ఉపాధ్యాయ బృందం, మర్కుక్ మండల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభ

మిరుదొడ్డి, ఆగస్టు 20: మండలంలోని అందె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రాములు అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని ఎంఈవో ప్రభుదాస్ అన్నారు. అందె ప్రాథమిక పాఠశాలలో మృతిచెందిన ఉపాధ్యాయుడు రాములు సంతాప సభను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలోనోడల్ అధికారి ప్రవీణ్ బాబు, ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణ, రాజేశ్వర్, స్రవంతి, సురేఖ, తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తొగుట, ఆగస్టు 20: మండలంలోని గోవర్ధనగిరిలో కాన్గల్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి తోయేటి ఎల్లయ్య, తోయేటి రక్షితలకు దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, కనకయ్య, రాఘవులు, కుమార్, స్వామి, భైరారెడ్డి, కమలాకర్, నరేంద్ర తదితరులున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

దౌల్తాబాద్, ఆగస్టు 20: ఇటీవల రాయపోల్ మండల అంకిరెడ్డిపల్లి గ్రామ వద్ద దౌల్తాబాద్ మండల మాచిన్‌పల్లికి చెందిన నవీన్, వంశీ ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎదిగిన కుమారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కుటుంబానికి తీరనిలోటని, అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయనవెంట పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు, నాయకులు బండారు లాలు, మద్దెల స్వామి, గొల్లపల్లి కనకయ్య తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేసిన కౌన్సిలర్

గజ్వేల్, ఆగస్టు 20: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన పూదరి రాంచంద్రం కూతురి వివాహానికి లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్వింటాలు బియ్యాన్ని ఫౌండేషన్ చైర్మన్ మర్కంటి కనకయ్య అందజేశారు. ఆయనవెంట 3వ వార్డు కౌన్సిలర్ మర్కంటి లక్ష్మి ఉన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి'

పెద్దశంకరంపేట,ఆగస్టు 20: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరముందని ఎన్‌హెచ్ఏఐ తెలంగాణ హైదరాబాద్ రీజినల్ అధికారి షేక్‌రజాక్ పేర్కొన్నారు. మంగళవారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్ జమ్మికుంట వద్ద 'ఏక్ పెడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పీడీ మదుసూదన్‌రావు, గజ్వేల్ జాయింట్ అడ్మిన్ రాజారావు, మహమ్మద్ రెహమాన్, రవిశంకర్, క్యూబ్ హైవేస్ రీజినల్ హెడ్ వసుంధర, శంకరంపేట ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ హెడ్‌ప్రభాకర్‌రెడ్డి, ఐఎంఎస్ మేనేజర్ కాజా మైనోద్దీన్, నిజాంపేట జిల్లాపరిషత్ విద్యార్థులు, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు శంకరంపేట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'హత్యాచార నిందితులను శిక్షించాలి'

గజ్వేల్, ఆగస్టు 20: హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై సభ్య సమాజం తలదించుకునే విధంగా హత్యాచారం చేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఘటనలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిష్పక్షపాతంగా న్యాయ విచారణ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రభుత్వాలు పటిష్ఠమైన, కఠినమైన చట్టాలు తీసుకురావాలన్నారు.

యూఎస్ఎఫ్ఐ పేరిట అక్రమ వసూళ్లు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి, దాసరి ప్రశాంత్



విలేకరులతో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 20: యూఎస్ఎఫ్ఐ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి, దాసరి ప్రశాంత్ ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం పట్ల అవగాహన లేని వారు ఆర్థిక ప్రయోజనాల కోసం, బతుకుదెరువు సంఘాలు పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్నాయన్నారు. జెండా, ఏజెండా, లక్ష్యం లేకుండా యూఎస్ఎఫ్ఐని ఏర్పాటు చేసుకుని డబ్బుల కోసం పనిచేస్తున్నారని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులు, విద్యా సంస్థల యజమానులు, మేధావులు ఆలోచించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తరపున విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. వారితో ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కొంక ప్రణయ్, కొనేరు ప్రవీణ్, డివిజన్ నాయకులు తాడెం భాస్కర్, కొల్గూరు ప్రవీణ్, అనిల్, లోకేశ్, రాజశేఖర్ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, ఆగస్టు 20: హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ భూముల్లోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని పలువురు నాయకుల అండదండలతో కట్టు కాలువలపై నిర్మాణాలు చేశారని ఆరోపించారు. పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలను అతిక్రమించి ఇళ్లను నిర్మించినా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపించాలని అధికారులను కోరారు.


'వరి, పత్తి పంటల్లో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి'



తీగుల్ రైతు వేదికలో శాస్త్రవేత్తల వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్నఅధికారులు, రైతులు

జగదేవ్‌పూర్, ఆగస్టు 20: వరి, పత్తి పంటల్లో యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్త లింగన్న, కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త వీరన్న సూచించారు. రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని తిగుల్ రైతువేదికలో రైతులు హాజరయ్యారు. ముందుగా రుణమాఫీ కానీ రైతుల ప్రశ్నలకు వ్యవసాయ సెక్రటరీ రఘునందన్‌రావు సమాధానమిచ్చారు. అనంతరం రైతులకు ఉన్న సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంత రావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు భానుప్రకాష్, ఖలీల్, సమత, కృష్ణమూర్తి, కిరణ్ రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వరల్డ్ మస్కిటో డే



మాట్లాడుతున్న అయోధ్యరెడ్డి

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 20: మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వల్ల రోగాల బారినపడకుండా ఉంటామని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మత్స్యశాస్త్ర, జంతుశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ దోమల రోజు (వరల్డ్ మస్కిటో డే) నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల వల్ల సంక్రమించే వ్యాధులు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి. హేమలత, కే. విశ్వనాథం, ఎమ్. మధుసూదన్‌రెడ్డి, డి. పుణ్యమ్మ, జి. వైకుంఠం, టి. జగదీశ్వర్‌చారి, జి. వెంకటేష్ తదితరులున్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా మంగళవారం పలుచోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసమే తన ప్రాణాలు అర్పించిన గొప్ప మహనీయుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



అక్కన్నపేట: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గజ్వేల్: తన నివాసంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నర్సారెడ్డి



మిరుదొడ్డి: అక్బర్‌పేటలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగమే ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రతినిధులు నర్సింహులు, సత్యం

సిద్దిపేట రూరల్, ఆగస్టు 20: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో బాగమే ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సిద్దిపేట జిల్లా ప్రతినిధులు మద్దెల నర్సింహులు, గుడిమాల సత్యం ఆరోపించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో మంగళవారం అంబేడ్కర్ యువజన సంఘం, మాల సంఘం ఆధ్వర్యంలో భారత్ బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 21న జరిగే భారత్ బంద్ ను విజయవంతం చేయాలన్నారు.

- కొండపాక: ఎస్సీ, ఎస్టీలకు, ఉపకులాల అందరికీ సమాన హక్కులు కల్పించాలని కోరుతూ ఈ నెల 21న జరిగే భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని మంగళవారం వెలికట్ట గ్రామ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. సంఘ నాయకుడు అమ్ముల నరసింహులు మాట్లాడుతూ.. మాలలు, ఉపకులాలు, మేధావులు, విద్యావేత్తలు, కవులు, సంస్కృతి కవాదులు ఏకతాటి పైకి వచ్చి వర్గీకరణను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో వెలికట్ట మాల సంఘం సభ్యులు అమ్ముల కనకయ్య, మెరుగు చిన్నబాల నర్సయ్య, అమ్ముల యాదయ్య, అమ్ముల పరశురాములు, అమ్ముల నర్సింహులు, అమ్ముల ఆనంద్, కిషన్, కర్ణాకర్, రాకేష్, రాము, వెంకటేష్, వంశీ, సురేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.
- గజ్వేల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21న మాలమహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని మాలమహానాడు నాయకులు తుమ్మ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాల పిలుపు మేరకు ఈ నెల 21 జరిగే భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఆయనవెంట మాలమహానాడు నాయకులు ముల్క శ్రీనివాస్, బీఎస్పీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొండనోళ్ల నరేశ్, బీఎస్పీ గజ్వేల్ అసెంబ్లీ అధ్యక్షుడు కానుగుల రమణాకర్, బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి ఆశని కనకప్రసాద్ ఉన్నారు.



సిద్దిపేట రూరల్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటు



నూతనంగా ఏర్పాటైన ఏఎంసీ పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, ఆగస్టు 20: బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఉత్తర్వు పత్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం నూతన పాలకవర్గానికి అందజేశారు. చైర్మన్‌గా పులికృష్ణ, వైస్ చైర్మన్‌గా చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌లుగా పులి సంతోష్, బోనాల మల్లేశం, బండిపెల్లి రాజు, మచ్చ కుమార్, పుల్ల పోచయ్య, మాతంగి అనిల్, నాయలపట్ల కనకయ్య, వొడ్డనాల నర్సయ్య, నల్ల చంద్రారెడ్డి, చాడ మౌనిక, గుండ వెంకట్‌రెడ్డి, బోయినపల్లి కృష్ణారావును నియమించారు. తమ నియామకానికి సహకరించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వపల్లి సత్యనారాయణ, నాయకులు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

కుకునూరుపల్లి, ఆగస్టు 20: మండల కేంద్రంలో కురుమ, యాదవ ఆధ్వర్యంలో బీరప్ప, మహంకాళి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.

బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గుండెల రాజు



సిద్దిపేట క్రైం, ఆగస్టు 20: బీజేపీ యువమోర్చా సిద్దిపేట జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన గుండెల రాజును నియమిస్తూ రాష్ట్ర శాఖ నియామక పత్రం అందజేసింది. రాజు గతంలో బీజేపీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. బాల్యం నుంచి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్వయం సేవక్‌గా, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌లో వివిధ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో భారతీయ జనతా యువ మోర్చా రాష్ట కార్యవర్గ సభ్యుడిగా ఎంపిక చేసినందుకు బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు20: సిద్దిపేట పట్టణంలోని 36వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన బీఆర్ఎస్ నాయకుడు రాజశేఖర్ (దూత) తన అనుచరులతో కలిసి మంగళవారం కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు సాకి ఆనంద్, రియాజుద్దీన్, బుచ్చిరెడ్డి, ఎల్లం యాదవ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడు

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, ఆగస్టు 20: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రైతుబాంధవుడని, రైతాంగం సంక్షేమం కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందని, ఏకకాలంలో రూ.2లక్షల పంటరుణ మాఫీ చేసిందని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. పంటరుణమాఫీ అమలుపట్ల మంగళవారం చేర్యాలలో రైతుసంబరాలు నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్ నుంచి మార్కెట్‌యార్డు వరకు రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. రైతాంగం కష్టసుఖాల్లో పాలుపంచుకుని అన్నదాతల్లో ఆనందం నింపింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలుకు కృషిచేయడంతో పాటు పంటరుణమాఫీతో సీఎం రేవంత్‌రెడ్డి పొందుతున్న రైతు, ప్రజాదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి విమర్శలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ కుట్రల నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి అన్నదాతలు అండగా నిలవాలన్నారు. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. పార్టీశ్రేణులు, రైతులు అధికసంఖ్యలో తరలివచ్చిన క్రమంలో ర్యాలీలో గాంధీచౌక్ వద్ద ప్రమాదవశాత్తు కాడెద్దు బెదిరి కాలు దువ్వడంతో పట్టణానికి చెందిన కంది సోమయ్య, దూళిమిట్ట మండలం హన్మతండాకు చెందిన నగావత్ పిటీ గాయాలపాలయ్యారు. వారిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.



ఎండ్లబండిని తోలుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి